క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న జెడ్పీటీసీ మీనాక్షి

మునిపల్లి(అందోల్): విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జెడ్పీటీసీ మీనాక్షి అన్నారు. మునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మంగళవారం డిజిటల్ క్లాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్, మాజీ ఎంపీపీ చంద్రయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంపై అవగాహన



సమతుల ఆహారంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త హేమలత

జహీరాబాద్: డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో గర్భిణులు, పాలిచ్చే తల్లులు తీసుకోవాల్సిన సమతులమైన ఆహారంపై అవగాహన కల్పించారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని రానగర్‌లో డీడీఎస్–కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త హేమలత, ఉద్యాన శాస్త్రవేత్తలు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తహీనత సమస్యను ఏవిధంగా గుర్తించవచ్చు, రక్త హీనతను నివారించడంలో ఐరన్, పోలిక్ యాసిడ్ పాత్ర తదితర అంశాలపై వివరించారు. ఎటువంటి ఆహార పదార్థాలలో పోషకాలు పుష్కలంగా లభిస్తాయనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ అంజమ్మ, టీచర్ అనిత, హెల్పర్ సూర్యకళ, మహిళలు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బహుజనులకు మేలు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బీఎస్పీ నాయకులు

నారాయణఖేడ్: రాజ్యాధికారంతోనే బహుజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవుతాయని ఖేడ్ నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షులు పండరి తెలిపారు. మంగళవారం నిజాంపేట్ మండలంలోని రాంరెడ్డిపేట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే బీఎస్పీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నిజాంపేట్ బీఎస్పీ మండల శాఖ అధ్యక్షులు రాములు, నాయకులు తుకారాం, డేవిడ్ పాల్గొన్నారు.


ఖేడ్ ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఏడుకొండలును మంగళవారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పోలీసుస్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఖేడ్ మండలం చాప్టా(కే) ఎంపీటీసీ రాజునాయక్, శేరితండా, సీతారాంతండా సర్పంచ్‌లు నెహ్రూనాయక్, రాజు, చాప్టా(కే) బీఆర్‌ఎస్ అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, వార్డుసభ్యులు తుకారాంరెడ్డి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రాంగొండ, బీఆర్‌ఎస్‌వీ నాయకులు అశోక్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మోర్ సూపర్ మార్కెట్ మేనేజర్ అదృశ్యం



శ్రీకాంత్ (ఫైల్)

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలో మోర్ సూపర్‌మార్కెట్ మేనేజర్‌గా పనిచేస్తున్న అల్లాదుర్గం శ్రీకాంత్ అదృశ్యమయ్యాడు. పట్టణంలోని భరత్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీకాంత్ కొన్ని సంవత్సరాల నుంచి మోర్ స్టోర్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 18న రాత్రి స్టోర్ క్లోజ్ చేసి వెళ్లిన తరువాత కనిపించకుండా పోయాడని అతని తమ్ముడు జగన్నాథం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- ఘనంగా విద్యాదినోత్సవం

జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా నిర్వహించిన విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన పాఠశాల భవనాలను ప్రారంభించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ విద్య ప్రాధాన్యతలతో పాటు మౌళిక సదుపాయాలను వివరించారు.



నారాయణఖేడ్: అధ్యాపకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



వట్‌పల్లిలో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న నాయకులు



రాయికోడ్: పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్



పటాన్‌చెరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జిన్నారం: బొల్లారంలో డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న రోజారాణి



రాయిపల్లి తండా పాఠశాలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అరుణ విజయమోహన్‌రెడ్డి



న్యాల్‌కల్: మెటల్‌కుంటలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, హెచ్‌ఎం



హత్నూర గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న ఆర్‌సీఓ భీమయ్య



నారాయణఖేడ్: విద్యార్థికి నోటుపుస్తకాలను అందజేస్తున్న నాయకులు



బుదేరా మహిళా డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసిన్



కంది: పూర్వ విద్యార్థి కాశీనాథ్‌ను సన్మానిస్తున్న చింతా ప్రభాకర్



జహీరాబాద్ టౌన్: మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్‌రెడ్డి

బీజేపీతోనే దేశాభివృద్ధి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి అరవిందమీనన్ అన్నారు. మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ జనసంపర్క్ అభియాన్‌లో భాగంగా భారతినగర్ డివిజన్‌లోని హెచ్‌ఎంజీ కాలనీలో నివాస ఉండే పారిశ్రామికవేత్త అరవ రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గడీల శ్రీకాంత్‌గౌడ్, ఎడ్ల రమేష్, నాయకులు మహేందర్, వ్యాపారవేత్త కిరణ్‌కుమార్, నాగమోహన్, కృష్ణారావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరవిందమీనన్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సంగారెడ్డి టౌన్: ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బైక్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ బోరబండ శ్రీనగర్‌కు చెందిన హైమద్ ఖాన్ మిత్రుడు మొహమ్మద్ హుస్సేన్ ఇద్దరు కలిసి హైమద్ ఖాన్ బంధువు సోమవారం చనిపోవడంతో జహీరాబాద్‌కు వెళ్లారు. అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో ఇద్దరూ కలిసి హైదరాబాద్ వస్తుండగా కంది చౌరస్తా సమీపంలోకి రాగానే వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించారు.

బీజేవైఎం ర్యాలీ

సంగారెడ్డి టౌన్: బీజేవైఎం ఆధ్వర్యంలో మహాజన సంపర్క్ అభియాన్లో భాగంగా మంగళవారం సంగారెడ్డి నియోజకవర్గ కార్యాలయం నుంచి 300 మంది యువకులు బైకులపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాజేశ్వరరావు దేశ్పాండే జెండా ఊపి ప్రారంభించారు.

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనమివ్వాలి

సదాశివపేట(సంగారెడ్డి): పెరిగిన ధరలకు అనుగుణంగా కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో ఉన్న కనీస వేతనాల జీవోలను తక్షణమే సవరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లేశం, శ్రీనివాస్, మోహన్, నాయుడు, రవి, దత్తు, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రవీన్‌కుమార్

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సంగారెడ్డి టౌన్: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రవాణారంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అడ్డాల దగ్గర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన మోటార్ వాహన చట్టం 2019 అమలుతో రవాణా రంగ కార్మికులపై అనేక భారాలను మోపుతోందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

టీచర్లపై చర్యలు తీసుకోవాలి

జహీరాబాద్ టౌన్: టీచర్ మందలించడంతోనే కస్తూర్బా పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య యత్నానికి పాల్పడిందని, టీచర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి రాజేష్ డిమాండ్ చేశారు. పాఠశాల భవనంపై నుంచి దూకి గాయాలపాలైన స్నేహలత జహీరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిని మందలించిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.



విద్యార్థినిని పరామర్శిస్తున్న రాజేష్



జహీరాబాద్ టౌన్: మాట్లాడుతున్న డీఎస్పీ రఘు

ప్రమాదాల సమయంలో స్పందించాలి

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు సత్వరంగా స్పందిస్తే సాటి మనిషి ప్రాణాలు దక్కుతాయని డీఎస్పీ రఘు అన్నారు. పట్టణంలోని పీవీఆర్ గార్డెన్‌లో మంగళవారం జాతీయ రహదారి పక్కన వ్యాపారాలు చేస్తున్నవారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఏదైన రోడ్డు ప్రమాదం జరిగినట్లయితే దగ్గరలో ఉన్నవారు వెంటనే స్పందించాలన్నారు. ప్రమాద విషయాన్ని పోలీసులకు తెలుపుతూ 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించేందుకు కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు తగ్గడానికి గంట(గోల్డెన్ హవర్)లో చేపట్టాల్సిన చర్యల గురించి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషురావు వివరించారు. సమావేశంలో జహీరాబాద్ టౌన్ సీఐలు భూపతి, పరమేశ్వర్, ఎస్ఐలు శ్రీకాంత్, కాశీనాథ్, సురేష్, కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో గోల్డెన్ అవర్ కీలకం

సదాశివపేట(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు ప్రమాద స్థలంలో ఉన్నవారిని వదిలేయకుండా బాధ్యతగా మానవీయంగా స్పందించి వారి ప్రాణాలను రక్షించాలని ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం సదాశివపేట పట్టణంలోని ఎంజీ మినీ ఫంక్షన్ హాలులో ప్రప్రథమంగా స్పందించే జాతీయ రహదారి పక్కన వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నవారితో పాటు యజమానులకు గోల్డెన్‌అవర్(బంగారు గంట) గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదైన రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అస్పత్రికి తరలించి చికిత్సలు అందించాలని సూచించారు. ఎందుకంటే ఈ గోల్గెన్ అవర్ ప్రాణాన్ని నిలబెట్టే జీవగంటయని తెలిపారు. ఎస్ఐ నాగలక్ష్మి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేట: అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం



శిరీష (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: శివాలయానికి వెళ్లివస్తానని చెప్పి మహిళ అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ సురేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని సీతారాంపురం కాలనీకి చెందిన సామ కిరణ్ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కిరణ్ భార్య శిరీష గొల్లబస్తీలో శివాలయానికి వెళ్లివస్తానని అత్తకు చెప్పి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసివారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త కిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచి వెళ్లిన యువకుడు..

ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మండలంలోని ఇస్నాపూర్‌కు చెందిన ప్రణీత్(19) డిప్లొమా చదువుతున్నాడు. ఈ నెల 18న మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రణీత్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ప్రణీత్ సోదరుడు రాఘవేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రణీత్ (ఫైల్)

గోకుల్‌నగర్‌లో యువతి..

అనారోగ్యంతో బాధపడుతున్న యువతి ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైంది. ఎస్ఐ దుర్గయ్య వివరాల ప్రకారం .. పట్టణంలోని గోకుల్‌నగర్‌కు చెందిన సమీరిన్ బేగం (25) ఈ నెల 19న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సమీరిన్ బేగం సోదరుడు రహీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సమీరిన్ బేగం (ఫైల్)

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సునీతమ్మ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీ–సేవా నుంచి కులం, ఆదాయ సర్టిఫికెట్లను ఉచితంగా అందజేసినట్లు ఆ సంస్థ అధ్యక్షులు శివశంకరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని కాసాల పాఠశాలలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన 34 మంది విద్యార్థులు తాహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగకుండా తామే స్వచ్ఛంద సంస్థ ద్వారా సర్టిఫికెట్లను అందించినట్లు తెలిపారు. సునీతమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయలక్ష్మి వెంకటేశం, పాఠశాల చైర్మన్ రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రణతి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా కసాల గ్రామంలో గ్రామ పంచాయతీ భవనంలో రీడింగ్ రూమును ఎంపీటీసీ విజయలక్ష్మి ప్రారంభించారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న శివశంకరరావు

ఉత్తమ అధ్యాపకుడికి పురస్కారం

జహీరాబాద్ టౌన్: ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైన వెంకట్‌రాంరెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ,, జేసీ వీరారెడ్డి సన్మానించారు. నియోజకవర్గంలోని కాకిజన్వాడకు చెందిన వెంకట్‌రాంరెడ్డి జోగిపేట పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సంగారెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన విద్యాదినోత్సవంలో సన్మానించి ప్రశంస పత్రాన్ని అందచేశారు. పురస్కారం రావడం ఆనందంగా ఉందని వెంకట్‌రాంరెడ్డి తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న వెంకట్‌రాంరెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం ఇటీవల అది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 15 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

◆ ఘనంగా పూరీజగన్నాథ రథోత్సవం



జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని జగన్నాథస్వామి రథోత్సవాన్ని మంగళవారం వైభవంగామ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని పలు వీధుల గుండా రథంపై ఊరేగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు స్వామివారి రథోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు సంతోష్‌కుమార్, బిస్వాల్, సభ్యులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ఇస్నాపూర్ గ్రామంలో జగన్నాథస్వామి రథయాత్రను జై జగన్నాథ్ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ రథయాత్రలో పటాన్‌చెరు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జై జగన్నాథ్ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, ఎస్ఆర్‌కే యువసేన సభ్యులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ మరాఠ సామాజికవర్గ కమిటీ ఎన్నిక

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుందా కాంగ్రెస్ గ్రామ మరాఠ సామాజికవర్గ నూతన కమిటీ ఎన్నిక గ్రామ అధ్యక్షుడు కమార్‌రావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. గ్రామ అధ్యక్షుడిగా లాలు రాంచందర్‌రావు, ఉపాధ్యక్షుడిగా బాపు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బాపు శంకర్‌రావు, కార్యదర్శిగా నాగోజిగారి రమేశ్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

◆ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు

సంగారెడ్డి టౌన్: సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని సంగారెడ్డి టౌన్ సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో డ్రైవర్ల శిక్షణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజాగ్రత్తతో వాహనాలు నడిపించడం ద్వారా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. 15 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. బస్‌డ్రైవర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఉపేందర్, డిప్యూటీ ఆర్ఎం జ్యోత్స్న, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

◆ పీడీఎస్ బియ్యం లారీ పట్టివేత

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి వైపు నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న పీడీఎస్ బియ్యం లోడ్ లారీని పుల్కల్ పోలీసులు తాడ్దన్‌పల్లి టోల్‌గేట్ వద్ద మంగళవారం పట్టుకున్నారు. ఈ మేరకు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు.

◆ దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి టౌన్: భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కడీలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫాల్గుణరావు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన ఫాల్గుణరావు బ్యాతోల్ గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో సూపర్వైజర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీన భూమిలోకి సత్తయ్య, సదానందం అనే ఇద్దరు వ్యక్తులు వచ్చి మా భూమిలో ఏం చేస్తున్నావ్ అంటూ బూతులు తిడుతూ కడీలను ధ్వంసం చేసి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ నేడు తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థన మందిరాలకు అలంకరణ చేసి దేవాలయాల్లో వేద పారాయణం, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని తెలిపారు. ఆధ్యాత్మిక దినోత్సవంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

◆ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని సంగారెడ్డి మున్సిపల్ వైస్చైర్మన్ లతావిజయేందర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని పోతిరెడ్డిపల్లి పాఠశాల నుంచి కాలనీలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ విద్యార్థికి ఆర్థికసాయం



జిన్నారం(పటాన్‌చెరు): పదో తరగతిలో పది జీపీఏ మార్కులు సాధించిన స్నేహశ్రీకి బొంతపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసమ్మ రూ.20వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ నవీన హెచ్‌ఎం శ్రీనివాసమ్మను అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించేవిధంగా ప్రధానోపాధ్యాయురాలు ఆర్థికసాయం అందించడం హర్షనీయమని ఎంపీపీ ప్రవీణ అన్నారు.